నమస్తే తెలంగాణ

మెదక్

I | హైదరాబాద్, శనివారం 19 అక్టోబర్ 2024 | MEDAK

చేర్యాలలో లవ్‌రెడ్డి బృందం సందడి

చేర్యాల, అక్టోబర్ 18: సిద్దిపేట జిల్లా చేర్యాలలోని వీరభద్ర థియేటర్‌లో శుక్రవారం లవ్‌రెడ్డి దర్శకుడు స్మరణ్‌రెడ్డి తన బృందంతో సందడి చేశారు. మండలంలోని గుర్జకుంటకు చెందిన స్మరణ్‌రెడ్డి పదేండ్లుగా సినీ ఇండస్ట్రీలో సహాయ దర్శకుడిగా కొనసాగుతున్నారు. ఏపీ, తమిళనాడు బార్డర్‌లోని ఓ గ్రామంలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా లవ్‌రెడ్డి సినిమాకు ఆయన దర్శకత్వం వహించాడు. శుక్రవారం లవ్‌రెడ్డి సినిమా విడుదలైంది. చేర్యాలలోని వీరభద్ర థియేటర్‌లో దర్శకుడు స్మరణ్‌రెడ్డి పలువురికి టికెట్లు ఇచ్చి ప్రేక్షకులతో కలిసి ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా

మాట్లాడుతూ సినిమాను ఆదరించాలని కోరారు. తనకు చేర్యాల ప్రాంత ప్రజలు సపోర్ట్ చేస్తున్నారని, సినిమా హిట్ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దర్శకుడు స్మరణ్‌రెడ్డికి ఫోన్ చేసి అభినందించారు.

సర్వే చేస్తరా..ఇంటికి పోతరా !

డిజిటల్ క్రాప్ సర్వే చేయకుంటే ఉద్యోగాలు పీకేస్తాం

ఔట్‌సోర్సింగ్ ఏఈవోలకు ఉన్నతాధికారుల అల్టిమేటం

- సర్వేచేయని వారి డేటా సిద్ధం చేస్తున్న అధికారులు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 265 రెగ్యులర్, 54 ఔట్‌సోర్సింగ్ ఏఈవోలు
- తీవ్ర పని ఒత్తిడితో మానసిక ఆందోళనలో ఉద్యోగులు
- డిజిటల్ సర్వేకు ప్రత్యేకంగా కేంద్ర నిధులు విడుదల
- ఇతర రాష్ట్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా సర్వే
- తెలంగాణలో మాత్రం ఏఈవోలపై పనిభారం మోపుతున్న ప్రభుత్వం

డిజిటల్ క్రాప్ సర్వే బాధ్యతలు అప్పగించవద్దని మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో డీఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఏఈవోలు

సిద్దిపేట, అక్టోబర్ 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'డిజిటల్ క్రాప్ సర్వే చేయాల్సిందే.లేకుంటే మీ ఉద్యోగాలు పోతాయి. సర్వే ఎందుకు చేయరు? మీరు ఏమనుకుంటున్నారు. మీరు కచ్చితంగా క్రాప్ సర్వే చేయాల్సిందే.ఎవరెవరు చేయడం లేదో మీ మీడేటాను సేకరిస్తున్నాం'..అంటూ ఔట్‌సోర్సింగ్ వ్యవసాయ విస్తరణ అధికారులకు ఆ శాఖ ఉన్నతాధికారులు బెదిరిస్తున్నారు. పగలు,రాత్రి అనే తేడాలేకుండా వారికి మెసేజ్‌లు పెడుతున్నారు.తక్షణమే డిజిటల్ పంట సర్వే మొదలు చేయకపోతే నిర్లక్ష్యంగా ఉద్యోగం నుంచి తొలిగిస్తామని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో ఓ నలుగురి ఉద్యోగాలు పీకేస్తే మీరంతా దారికి వస్తారంటూ సిద్దిపేట జిల్లా స్థాయి అధికారి హెచ్చరిస్తున్నట్లు సమాచారం.ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు రెగ్యులర్ ఏఈవోల తప్పులను చూపుతూ వారిని సస్పెండ్ చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ వారితో పాటు ఒకరిద్దరు రెగ్యులర్ ఉద్యోగులను పక్కన పెడితేనే భయంతో సర్వేకు వెళ్తారని ఉన్నతాధికారుల భావన. ఏదో రకంగా భయపెట్టి డిజిటల్ క్రాప్ సర్వే చేయించాలని ఉన్నతాధికారులు చూస్తున్నారు. తాము ఎట్టి పరిస్థితుల్లోనూ డిజిటల్ సర్వే చేసేది లేదని వ్యవసాయ విస్తరణ అధికారులు చెబుతున్నారు. మిగతా రాష్ట్రాల్లో ఎలా సర్వే చేయిస్తున్నారో మన రాష్ట్రంలో కూడా అలానే చేయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.వ్యవసాయ శాఖలోని వివిధ పనులు చేస్తూనే డిజిటల్ సర్వే చేయాలంటే తమ నుంచి కాదని వారు చెబుతున్నారు.ఒక్క ఏఈవో సరాసరిగా 20వేల ఎకరాలు సర్వే చేయడం సాధ్యమవుతుందా..?అని వారు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికే క్రాప్ కటింగ్ వచ్చిందని, ప్రస్తుతం పంట క్రాప్ సమయంలో డిజిటల్ సర్వే ఎలా చేయగలుగుతామని వారు అంటున్నారు. పంట చేతికి రావడంతో మామీద మరింత పనిభారం పెరగిందని చెబుతున్నారు. రైతుబీమా, రుణమాఫీ, పంట నష్టం సర్వే, పంటల నమోదుతో పాటు ఇతర పనుల్లో బిజీగా ఉన్న తాము, ఇప్పుడు పంటలు కోతకు రావడంతో కొనుగోళ్లు చూడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. దొడ్డు వడ్లు, సన్నాలు గుర్తించాల్సి ఉంటుందని, తీవ్ర పనిఒత్తిడి ఉందని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే తమతో చేయించవద్దని ఔట్‌సోర్సింగ్ ఏఈవోలు జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్లకు, వ్యవసాయ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. వ్యవసాయ వృత్తి విద్య కోర్సులు చదివి, అతి తక్కువ జీవితంతో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఏఈవోలపై ఉన్నతాధికారుల వేధింపు చర్యలను వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కాంట్రాక్ట్ ఏఈవోలకు రెగ్యులర్ ఏఈవోలు తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నారు. వీరిపై కక్షపూరిత చర్యలు మానుకోకపోతే నిరవధిక సమ్మె చేయడానికి తామంతా సిద్ధంగా ఉన్నామని రెగ్యులర్ ఏఈవోలు చెబుతున్నారు.

ఆందోళనకు సిద్ధమవుతున్న ఏఈవోలు

డిజిటల్ పంట సర్వేను కచ్చితంగా ఏఈవోలు చేయాలని తెలంగాణ వ్యవసాయ శాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఒత్తిడి తెస్తున్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా చేయించకుండా తమమీద పనిభారం మోపుతున్నారని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క ఏఈవో 15 నుంచి 20వేల ఎకరాల్లో సర్వే చేయాలంటే తమవల్ల కాదని ఏఈవోలు యాప్ డౌన్‌లోడ్ చేసుకోకుండా నిరసన తెలుపుతున్నారు. డిజిటల్ క్రాప్ పనులు చేయకపోతే గైరాజరు వేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఉన్నతాధికారులు భయభ్రాంతులకు గురిచేస్తుండడంతో దిక్కుతోచని స్థితిలో ఏఈవోలు, కాంట్రాక్ట్ ఏఈవోలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 319 మంది ఏఈవోలు పని చేస్తున్నారు. వీరిలో రెగ్యులర్ ఏఈఓవోలు 265 మంది, ఔట్ సోర్సింగ్‌లో 54 మంది పని చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో రెగ్యులర్ ఉదోగులు 90 మంది, అవుట్ సోర్సింగ్‌లో 37 మందితో కలిపి 127 మంది పని చేస్తున్నారు. మెదక్ జిల్లాలో రెగ్యులర్ ఉదోగులు 68మంది, అవుట్ సోర్సింగ్‌లో 8 మందితో కలిపి 76 మంది, సంగారెడ్డి జిల్లాలో రెగ్యులర్ ఉదోగులు 107మంది, అవుట్ సోర్సింగ్‌లో 9మందితో కలిపి 116 మంది పనిచేస్తున్నారు. వీరితోనే క్రాప్ డిజిటల్ సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి ఏఈవో 25 మీటర్లలోపు నుంచి యాప్‌లో ఫొటోను తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ పరిధిలో మాత్రమే యాప్ ఓపెన్ అవుతుంది. సర్వేనెంబర్ల ఆధారంగా ఏఏ పంటలు ఎన్ని ఎకరాల్లో వేశారు అనే వివరాలను ఆ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో కొన్ని ప్రాంతాలు ఎత్తయినవి ఉంటాయి. కొన్ని గుట్ట ప్రాంతాలు , వాగులు అవతలి, ఇవతలి ప్రాంతాలతో పాటు సరైన బాటలు లేకపోవడంతో కొన్ని భూములకు పోయి సర్వే చేయాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది. కొన్ని సర్వే నెంబర్లకు బై నెంబర్లు ఉంటాయి. వాటి విషయంలో రెవెన్యూ అధికారుల సహకారం లేనిది ఏమాత్రం చేయరాదు. మహిళా ఉద్యోగులు కొండలు, గుట్టలు ప్రాంతాలకు వెళ్లాలంటే సాధ్యమయే పనికాదు. వీటన్నింటిని దాటుకొని సర్వే చేయాల్సి ఉంటుంది.కొండలు, గుట్టలు, అటవీ భూముల్లో పంట సర్వేకు ఒంటరిగా వెళ్లిన సందర్భాల్లో ఏఈవోలు అనుకోని ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతే రెగ్యులర్ ఏఈవోల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా అండదండలు ఉంటాయి. వ్యక్తిగత ప్రమాదబీమా వర్తించడంతో పాటు వీరి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే అవకాశాలు ఉంటాయి. కానీ, కాంట్రాక్టు ఏఈవోలకు ఎలాంటి ఉద్యోగ భద్రత, ప్రయోజనాలు లేవు.

డిజిటల్ క్రాప్ సర్వేకు కేంద్రం నిధులు

తెలంగాణలో క్రాప్ డిజిటల్ సర్వే బాధ్యతను ఏఈవోలకు ప్రభుత్వం అప్పగించింది. మిగతా రాష్ట్రాల్లో వెయ్యి నుంచి రెండు వేల ఎకరాలకు గ్రామ వ్యవసాయ సహాయకుడిని నియమించారు.వారితో డిజిటల్ సర్వే చేయిస్తున్నారు. ఒక సర్వే నెంబరులో ఒక ఫొటోకు కేంద్ర ప్రభుత్వం రూ.10 చొప్పున ఇవ్వనున్నది. ఈ డబ్బులతో ఇతర రాష్ట్రాల్లో వ్యవసాయ సహాయకులకు ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇచ్చి చేయిస్తున్నారు. తెలంగాణలో మాత్రం ఆ డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం వద్దే ఉంచుకొని ఏఈవోల మీద పనిభారం రుద్దుతున్నది. ఇప్పటికే తమపై పనిభారం ఎక్కువైందని వారు వాపోతున్నారు. డిజిటల్ సర్వే ప్రధాన ఉద్దేశం భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఆహార భద్రత, పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాలతో జరిగే పంట నష్టాన్ని అంచనా వేయడం, ఆహార ధాన్యాల ఎగుమతి పంటల కొనుగోలు సాగు ప్రణాళిక మార్కెటింగ్ తదితర అవసరాల నిమిత్తం డిజిటల్ పంట సర్వే ప్రధాన భూమిక పోషించనున్నది. ఇందులోభాగంగానే వ్యవసాయరంగంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ని రూపొందించే లక్ష్యంతో డిజిటల్ అగ్రిమిషన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. దీనిని అమలు చేయడానికి రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. దేశవ్యాప్తంగా దీనికి రూ.2,817 కోట్లు కేటాయించింది. రైతులకు ప్రయోజనం చేకూర్చటానికి, వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచటానికి ఆధునిక సాంకేతికను వినియోగించనున్నది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ కార్యక్రమాన్ని కేంద్రం నిర్వహిస్తుంది. ఏఈవోలకు గతంలోనే ట్యాబ్ అందించినా ప్రస్తుతం అవి పనిచేయడం లేదు .దీంతో సొంత ఫోన్లలోనే ఫొటో లు తీసి వివరాలు నమోదుచేయాల్సి వస్తుందని ఏఈవోలు చెబుతున్నారు.



జగ్య, భీమ్ల తండాల్లో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు (ఇన్‌సెట్‌లో) ఉసిరికపల్లి ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- డబుల్‌రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలి
- మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- బాధిత కుటుంబాలను ఎల్లవేళలా ఆదుకుంటామని ఎమ్మెల్యే వెల్లడి

శివ్వంపేట, అక్టోబర్ 18: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గిరిజనుల కుటుంబాలకు అండగా ఉంటామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ప్రమాదంలో మృతిచెందిన తాళ్లపల్లితండా, జగ్యతండా, భీమ్లతండాలో బాధిత కుటుంబాలను శుక్రవారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. అధైర్యపడొద్దని అండగా ఉంటామని వారికి ధైర్యం చెప్పి తనవంతు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి మాట్లాడారు. ఏడుగురు ఒకేసారి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం చాలా బాధాకరమైన ఘటన అని, మృతులంతా రక్తసంబంధీకులే కావడంతో ఒక్కొక్కరి బాధలు చూస్తుంటే గుండె తరుక్కుపోతుందన్నారు. ప్రభుత్వం ఒక్కొక్కరికీ రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చేలా కలెక్టర్, సీఎం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. డబుల్‌రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసి కల్వర్టుల వద్ద పొంచిఉన్న ప్రమాదాలను అరికట్టాలని అధికారులకు సూచించారు. బాధిత కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా తామందరం అండగా నిలబడుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి రైతు బీమా వచ్చేలా అధికారులతో మాట్లాడతానని తెలిపారు. ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణాగౌడ్, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, ఆత్మకమిటి మాజీ చైర్మన్ గౌరెవెంకట్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ నయీమొద్దీన్, సీనియర్ నాయకులు యాదాగౌడ్, సంతోష్‌రెడ్డి, మర్రి మహేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, లాయక్, మాజీ సర్పంచ్ చెన్నానాయక్, సిలువేరు ఆంజనేయులు, యువత అధ్యక్షుడు పవన్‌గుప్తా ఉన్నారు.

మాటలు చాలించి నిర్వాసితులను ఆదుకోవాలి

- ప్రభుత్వం రూ.448కోట్లు విడుదల చేయాలి
- హామీలను అమలు చేసి కాంగ్రెస్ సర్కారు చిత్తశుద్ధిని చాటుకోవాలి
- గజ్వేల్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 18: సీఎం రేవంత్‌రెడ్డి మొదలుకొని కాంగ్రెస్ నాయకులంతా మాటలు చాలించి ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ముంపు గ్రామాల నిర్వాసితులు 400మందికి రావాల్సిన రూ.448కోట్లను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని గజ్వేల్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ముంపు గ్రామాలకు చెందిన 9600మంది బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ఓపెన్ ప్లాట్లు, ప్యాకేజీలు అందజేశామన్నారు. మైకుల ముందు మాట్లాడి ప్రజలను అయోమయానికి గురిచేసి అబద్ధాలు మాట్లాడడం కాంగ్రెసోళ్లకు అలవాటైందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు చేయతనిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వారిని అప్పుల ఊబిలోకి నెడుతోందని విమర్శించారు. కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల నిర్మించి కేసీఆర్ సాగు,తాగునీటి కష్టాలు తీర్చారన్నారు. హైదరాబాద్ నగరానికి తాగునీటిని అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మూసీ సుందరీకరణ పేరు చెప్పి పెద్ద స్కామ్‌కు కాంగ్రెస్ సర్కారు తెరలేపిందని ఆయన. కాంగ్రెస్ సర్కార్ మొద్దు నిద్ర వీడి ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రైతులకు రుణమాఫీని వెంటనే అమలు చేయాలని, చేతకాని పక్షంలో సీఎం పదవికి రాజీనామా చేయాలని వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. దమ్ముంటే మాజీమంత్రి హరీశ్‌రావు సవాల్‌ను స్వీకరించి మల్లన్నసాగర్, కొండపోచమ్మ ముంపు గ్రామాల్లో పర్యటిస్తే వెయ్యి మందితో స్వాగతం పలుకుతామని వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు.

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం మొగ్దుంపల్లిలో తాగునీటి కోసం తంటాలు పడుతున్న గ్రామస్తులు

మొగ్దుంపల్లిలో తాగునీటికి కటకట

మునిపల్లి, అక్టోబర్ 18: సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం మొగ్దుంపల్లిలో తాగునీటికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలు గు రోజుల నుంచి సమస్య వేధిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచ్ అశోక్, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సరిపోను నీళ్లు రాకపోవడంతో నల్లాల దగ్గర గ్రామస్తులు పడిగాపులు కాస్తున్నారు. మళ్లీ పాత రోజులు వచ్చాయని, అధికారులు స్పందించి తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంపై మునిపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి అంగడ్‌కుమార్‌ను వివరణ కోరగా.. నాలుగు రోజుల క్రితం మిషన్ భగీరథ పైపులైన్ లీకేజ్ కావడంతో నీటి సరఫరా నిలిపివేశామని, రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన గురుకుల విద్యార్థిని

చేర్యాల, అక్టోబర్ 18: సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో కొనసాగుతున్న జనగామ జిల్లా నర్మెట్ట బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(కళాశాల)లో శుక్రవారం రాత్రి ఓ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించింది. గాయాలపాలైన ఆమెను హుటాహుటిన చేర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. విద్యార్థి పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో సిద్దిపేట దవాఖానకు తరలించారు. దసరా సెలవులు ముగిసిన అనంతర నర్మెట్ట బాలికల పాఠశాల(కళాశాల)కు చెందిన విద్యార్థులు రోజువారీగా వచ్చి రిపోర్టు చేస్తున్నారు. ఈ విద్యాసంస్థలో నిర్వహణ సక్రమంగా లేదని, ఉపాధ్యాయులు, అధ్యాపకులు కేవలం స్టాఫ్ రూమ్‌కే పరిమితం అవుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియలేదు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను నమస్తే తెలంగాణ ఫోన్‌లో సంప్రదించగా..సెలవుల్లో ఉన్నానని, ఘటనపై టీచర్లు తనకు ఫోన్ చేసి చెప్పారని, విద్యార్థి ఆరోగ్యం బాగానే ఉందని, సిద్దిపేటకు తీసుకుపోతున్నారని, పూర్తి వివరాలు తెలుసుకుని చెబుతానన్నారు.

గుర్రాలగొంది నుంచి నారాయణరావుపేట రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులు, రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు

రోడ్డు ఇలా..వెళ్లేదెలా

నారాయణరావుపేట, అక్టోబర్ 18: గుర్రాలగొంది నుంచి నారాయణరావుపేటకు వెళ్లే బీటీ రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముండ్ల పొదలు కమ్మేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గుర్రాలగొంది నుంచి నారాయణరావుపేటవరకు 6 కిలోమీటర్ల మేర ఉన్న బీటీ రోడ్డులో 36 ప్రమాదకర మలుపులు ఉన్నాయి. మలుపుల వద్ద కనీస సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల పొదలను తొలగించడంతో పాటుగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఫిర్యాదుదారుడితో మాట్లాడి సమస్యను తెలుసుకుంటున్న పోలీసు కమిషనర్ అనురాధ

ఫిర్యాదులు వేగంగా పరిష్కరించాలి

సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ

సిద్దిపేట కమాన్, అక్టోబర్ 18: పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా వారి సమస్యలు పరిష్కరించాలని, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ డాక్టర్ అనురాధ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం సిద్దిపేట రూరల్ పోలీసు స్టేషన్‌ను, సిద్దిపేట రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. డయల్ 100 కాల్‌కు పోలీస్ సిబ్బంది వెంటనే స్పందించాలని, ప్రతి రోజు ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ విధులు నిర్వహించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇసుక, జూదం, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి కేసులో పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు. బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలన్నారు. సీపీ వెంట సిద్దిపేట ఏసీపీ మధు, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్‌బీఐ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, సిద్దిపేట రూరల్ ఎస్‌ఐ అపూర్వరెడ్డి, రాజగోపాలపేట ఎస్‌ఐ ఆసిఫ్, చిన్నకోడూరు ఎస్‌ఐ బాలకృష్ణ, బెజ్జంకి ఎస్‌ఐ కృష్ణారెడ్డి, రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, సిద్దిపేట రూరల్ సర్కిల్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



వర్గల్ తహసీల్ కార్యాలయం సమీపంలో ఏర్పడిన గుంతలు

అడుగుకో గుంత.. ప్రయాణం చింత

వర్గల్,అక్టోబర్18: వర్గల్ మండలకేంద్రంలోని ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. తహసీల్ కార్యాలయం ముందు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు తారురోడ్డు కంకర తేలింది. గుంతలు పడటంతో రోడ్డుపై ప్రయాణం నరక ప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. వర్షం నీరు సైతం ఈ రోడ్డుపైనే ప్రవహిస్తుండడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఆయా గ్రామాల నుంచి నిత్యం వివిధ పనుల నిమిత్తం మండలకేంద్రానికి వచ్చే ప్రజలు రోడ్డుతో తిప్పలు పడుతున్నారు. రోడ్డును బాగుచేయాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లతో మెరుగైన ఉపాధి

కలెక్టర్లు వల్లూరు క్రాంతి, మను చౌదరి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్లు మనుచౌదరి, వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్/సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబర్ 18: మెరుగైన ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు వల్లూరు క్రాంతి, మనుచౌదరి తెలిపారు. యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా ప్రభుత్వం ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో జిల్లాల్లో నూతనంగా నెలకొల్పిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ)లో ప్రవేశాలకు సంబంధించి శుక్రవారం ఆ శాఖ ప్రధాన కార్యదర్శి సంజయ్ కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశం అనంతరం సంగారెడ్డి జిల్లా కార్మిక శాఖ అధికారి రవీందర్‌రెడ్డితో సమావేశమైన కలెక్టర్ ఏటీసీ కేంద్రాల ఏర్పాటుపై దిశానిర్దేశం చేశారు. ప్రవేశాల ప్రక్రియను వేగవంతం చేయాలని, ఏటీసీ కేంద్రాలపై అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. జిల్లాలో తొలి విడతగా సంగారెడ్డి, హత్నూర ఐటీఐలను గుర్తించి ఏటీసీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోనే ఏటీసీ కేంద్రాలను కొనసాగిస్తూ ఆయా కోర్సుల్లో శిక్షణను ప్రారంభిస్తామన్నారు. ఈనెల 31 చివరి తేదీ అయినందున అర్హత, ఆసక్తి గల వారు ఏటీసీ కేంద్రంలో నిర్దేశిత కోర్సుల్లో ప్రవేశం పొంది సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. సంగారెడ్డి, హత్నూర ఐటీఐలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలలోగా అన్ని పనిదినాల్లో ఇంటర్వ్యూకు హాజరుకావచ్చన్నారు. వివరాలకు సంగారెడ్డి ప్రిన్సిపాల్‌ను 9848935146, హత్నూర ప్రిన్సిపాల్‌ను 9963004960 ంబర్లపై సంప్రదించాలని సూచించారు. సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ..ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటి ఫేజ్‌లో కుకునూర్‌పల్లి ఐటీఐని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌గా మార్చి నూతనంగా ఆరు అధునాతన కోర్సులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఏటీసీ కేంద్రాల్లో అడ్మిషన్ల ప్రక్రియ పర్యవేక్షణకు డీఆర్డీవోను ప్రత్యేక నోడల్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. జిల్లాలో నిర్దేశిత లక్ష్యం 172 మంది విద్యార్థులను ఏటీసీ కేంద్రాల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని కుకునూర్‌పల్లి ఏటీసీ ప్రిన్సిపాల్ వెంకటరమణను కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపాధికల్పన అధికారి రాఘవేందర్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ప్రాణాల మీదికి తెస్తున్న పార్కింగ్

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని ట్రాఫిక్, బల్దియా అధికారులు, ప్రజాప్రతినిధులు



ఆర్సీపురం హిందూ శ్మశానవాటిక రోడ్డు మార్గంలో ఇరువైపులా పార్కింగ్ చేసిన ట్రాక్టర్లు

రామచంద్రాపురం, అక్టోబర్18: ఆర్సీపురం జాతీయ రహదారికి వెళ్లేందుకు ప్రధానమైన రోడ్డుకు ఇరువైపులా ట్రాక్టర్లు, జేసీబీలు పార్కింగ్ చేస్తుండడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో చీకటితో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ట్రాక్టర్లు, జేసీబీలను పార్కింగ్ చేయడంతో రోడ్డు కుదించుకుపోయి వాహనాల రాకపోకలకు, స్థానికులు నడుచుకుంటూ వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. సాయంత్రం పదుల సంఖ్యలో ట్రాక్టర్లను పార్కింగ్ చేస్తుండడంతో రాత్రిళ్లు ప్రయాణం చేసేవారు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తున్నది. భారతీనగర్ డివిజన్ ఎల్ఐజీ నుంచి ఆర్సీపురం హిందూ శ్మశానవాటిక మీదుగా రోడ్డు మార్గంలో జాతీయరహదారి వైపునకు వెళ్లేందుకు..అటు నుంచి ఇటు ఎల్ఐజీ, బీడీఎల్ కాలనీలకు రావడానికి వాహనదారులు, పాదచారులు, ఆటోలు ఈ మార్గం గుండా ప్రయాణం చేస్తుంటారు. సరిగ్గా హిందూ శ్మశానవాటిక దగ్గర నుంచి చర్చి ప్రహరీ వరకు ట్రాక్టర్లు, జేసీబీలను పార్కింగ్ చేస్తున్నారు. ఆ మార్గంలో విద్యుత్ లైట్లు కూడా సరిగ్గా లేకపోవడంతో రాత్రివేళల్లో పార్కింగ్ చేసిన వాహనాల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏడు రోజుల క్రితం రాత్రి సమయంలో ఓ ఆటో జేసీబీకి తగిలి ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలై ఆటో డ్యామేజ్ అయింది. ఇటీవల పలువురు ద్విచక్ర వాహనదారులు ట్రాక్టర్లను ఢీకొని ప్రమాదాలకు బారినపడ్డారు. ఈ విషయాన్ని ట్రాఫిక్ పోలీసులు, కార్పొరేటర్ పుష్పానగేశ్ సీరియస్‌గా తీసుకొని రోడ్డుకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేయనివ్వకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.